
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు
3
శనివారం 1 ఫిబ్రవరి 2025

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.59 కోట్లు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లన్న హుండీ లెక్కింపులో రూ.2,59,68,400 ఆదాయం సమకూరింది. శుక్రవారం దేవస్థానం పరిధిలోని చంద్రావతి కళ్యాణ మంటపంలో నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో నగదుతో పాటు 64.20 గ్రాముల బంగారం, 3.17కేజీల వెండితో పాటు పలు విదేశీ కరెన్సీలు లభించాయి. ఇందులో యూఎస్‌ఏ డాలర్లు -590, చైనా యువాన్స్ -100, సౌదీ అరేబియా రియాల్స్ -5, కువైట్ దినార్స్ -2, కెనడా డాలర్లు -10, యూఏఈ దిర్హామ్స్ -1090, సింగపూర్ డాలర్లు -14, ఖత్తార్ రియాల్ -1, యూరోప్ -5, మలేసియా లింగిల్స్ -23, యూకే పౌండ్స్ -45, ఆస్ట్రేలియా డాలర్లు -240, రష్యా రూబెల్స్ 30 తదితర విదేశీ కరెన్సీ రాబడిగా వచ్చింది. కాగా ఈ ఆదాయం జనవరి 9 నుంచి 30వ తేది వరకు భక్తులు సమర్పించినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా చేపట్టినట్లు చెప్పారు.

మల్లన్న సన్నిధిలో నటి మీనాక్షి చౌదరి

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శుక్రవారం 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ మీనాక్షి చౌదరి దర్శించుకున్నారు. ముందుగా ఆమె రత్నగర్భ వినాయకస్వామిని దర్శించుకుని అనంతరం గర్భాలయంలో మల్లికార్జునస్వామికి అభిషేకాలు చేశారు.



తర్వాత భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన నిర్వహించారు. కాగా ప్రముఖ హీరోయిన్ శ్రీశైలానికి రావడంతో అక్కడున్న వారు ఆమెతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి కనబరిచారు.

- రుద్రవరంలో అక్రమ బిల్లులతో రూ. 1.88 కోట్లు స్వాహా
- ఈ అక్రమాల్లో సర్పంచ్‌తో పాటు కొందరు కార్యదర్శుల పాత్ర
- తాజాగా జిల్లా యంత్రాంగానికి నివేదిక అందజేత
- అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..?
- నగదు రికవరీ చేస్తారా..?
- రుద్రవరం మేజర్ పంచాయతీలో హెచ్చుమీరిన అవినీతి



రుద్రవరం మేజర్ పంచాయతీ కార్యాలయం (పాత భవనం)



ఏకమై కాజేశారు...!

ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలు విస్తుగొలుపుతున్నాయి. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుతో జరిగిన విచారణలో అసలు విషయాలు బయటకు వచ్చాయి. దీంతో రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతితో పాటు, సర్పంచ్ బైరి విజయలక్ష్మిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఇటీవల అధికారులను ఆదేశించారు. దీంతో నంద్యాల డీపీఓ షేక్ జమీఉల్లా రంగంలోకి డీఎల్‌పీఓ రాంబాబును విచారణ అధికారిగా నియమించారు. విచారణ వేగవంతం చేయడంతో సదరు పంచాయతీలోని అవినీతి అక్రమాల గుట్టు రట్టయింది. మొత్తంగా గత వైసీపీ సర్కార్ అండదండలతో తమ సర్పంచ్ పదవిని అడ్డుగా పెట్టుకుని.. గత నాలుగేళ్ల కాలంలో ఆయా సమయాల్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై సదరు సర్పంచ్, వైసీపీ నాయకులు ఫేక్ బిల్లులు సృష్టించి రూ.1.88 కోట్లు ప్రజాధనం కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల వెనుక వైసీపీ నాయకులు దగ్గరుండి ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నంద్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో అవినీతి అక్రమాలు జోరందుకున్నాయి. జనరల్ నిధుల నుంచి పశువుల సంత, దినసరి మార్కెట్ వేలం ఇతరత్రా పనులు గత నాలుగేళ్లలో అవినీతిమయమయ్యాయి. పంచాయతీ సర్పంచ్‌తో పాటు కొందరు కార్యదర్శులు కలిసి పనులు చేయకుండా చేసినట్లు రికార్డులు సృష్టించారు. మోటర్ల మరమ్మతులు కాకపోయినా చేసినట్లు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయకపోయినా చేసినట్లు.. ఇలా పలు రూపాల్లో దోపిడికి పాల్పడి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఈ తరుణంలో సదరు పంచాయతీకి చెందిన కొందరు వార్డు సభ్యులు, ప్రజలు కలిసి గత ఏడాది డిసెంబరు 2వ తేదిన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ డీపీఓతో కలసి డీఎల్‌పీఓ రాంబాబును విచారణ అధికారిగా నియమించారు.

డీఎల్‌పీఓ విచారణతో వెలుగులోకి అవినీతి

డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) 20.12.24వ తేదిన రుద్రవరం మేజర్ పంచాయతీలో విచారణ చేపట్టారు. సుమారు 40 రోజులు పాటు లోతుగా విచారణ చేయడంతో అవినీతి అక్రమాలకు చెందిన పలు కీలక అంశాలు వెలుగు చూశాయి. కనీసం రికార్డులు నమోదు, రిజిస్టర్ల నిర్వాహణ, వస్తువుల ఎంట్రీ తదితర వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. ఇదే తరుణంలో వచ్చిన ఫిర్యాదులో భాగంగా 10 అంశాలపై లోతుగా విచారణ చేయడంతో గత నాలుగేళ్లలో రూ.1,88,35,330 నగదును అక్రమంగా కాజేసినట్లు గుర్తించారు. అందుకు సంబంధించి తగిన సమగ్ర నివేదికను తాజాగా కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. మొత్తంగా రుద్రవరం మేజర్ పంచాయతీలో కీలక అధికారి విచారణతో అవినీతి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.



విచారణ నివేదికలోని ధృవపత్రాలు

సర్పంచ్‌కు సహకరించిన కార్యదర్శులు

రుద్రవరం పంచాయతీలో నాలుగేళ్లలో జరిగిన అవినీతి, అక్రమాల్లో సర్పంచ్‌తో పాటు పలువురు కార్యదర్శుల పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలింది. ఆయా సమయాల్లో సదరు పంచాయతీలో పనిచేసిన కార్యదర్శులు సుబ్బరాయుడు, ఎన్.భాగ్యలక్ష్మి, అక్తర్ మొహమ్మద్‌రఫీ, పట్నం చెన్నయ్య, ప్రస్తుత వెంకట సుబ్బరాయుడు, సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఉన్నట్లు నివేదికలో కలెక్టర్‌కు తెలియజేశారు. ఏది ఏమైనా విచారణలో సదరు పంచాయతీ అవినీతి, అక్రమాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

మిగతా 4వ పేజీలో

నంద్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా భూ కబ్జాలు.. అవినీతి, అక్రమాలే. బనగానపల్లి పట్టణ కేంద్రంలో కూడా ఇద్దరు వ్యక్తులు మర్చంట్ అసోసియేషన్ ముసుగులో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిపై కన్నేశారు. ఆ తర్వాత ఇంకేముంది నకిలీ పట్టాలు సృష్టించి 'ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ రెసిడెన్సీ' పేరుతో ఐదు సెంట్లలో విలాసవంతమైన భవనాన్ని నిర్మించారు. ఎక్కడ నుంచి ఎలాంటి సమస్య రాకుండా పథకం ప్రకారం.. అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో భవనాన్ని ప్రారంభోత్సవం చేయించడం గమనార్హం. ఏకంగా ఎమ్మెల్యేనే ప్రారంభించడంతో అక్రమార్కుల పని సులువైంది. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో తాజాగా ఆ భవనంపై కొందరికి అనుమానం వచ్చింది. పంచాయతీ కార్యదర్శితో పాటు పలుశాఖల అధికారులకు స్థలం అనుమతులపై ఆర్టీ యాక్ట్ కింద వివరాలు కోరడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. పైగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఈ భవన వ్యవహారం మరింత హాట్ టాపిక్‌గా మారింది. ఆ భవనం పక్కాగా అక్రమం అని తెలియడంతో ఇప్పుడు చర్యలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.



- ప్రభుత్వ భూమిపై కొందరి కన్ను
- ఐదు సెంట్లలో ఓ అసోసియేషన్ రెసిడెన్సీ ఏర్పాటు
- గత సర్కార్ హయాంలో ప్రారంభం
- పట్టించుకోని అధికారులు

దర్జాగా కబ్జా...!

అక్రమ భవనం వెనుక ఎవరి హస్తం?

సాధారణంగా నిరుపేదలు ఎవరైనా ఖాళీ జాగాలో చిన్నపాటి గుడిసె వేసినా వెంటనే పలు రకాలుగా ఇబ్బందులు ఉంటాయి. అలాంటిది గత సర్కార్ హయాంలో ఇద్దరు వ్యక్తులు కలిసి లక్షలు విలువ చేసే (ఎస్ఆర్‌బీసీ స్థలం) ఐదు సెంట్ల స్థలంపై నకిలీ పట్టాలు సృష్టించుకుని దర్జాగా విలాసవంతమైన భవనాన్ని నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. నకిలీ పట్టాలు సృషించడం వెనుక ఏ అధికారుల పాత్ర ఉందో..? ఏ రాజకీయ ప్రతినిధుల హస్తం ఉందో..? ఎవరి అండదండలతో ధైర్యంగా భవనం నిర్మించారో..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



గుండా రవికుమార్ పేరు మీద తయారు చేసిన నకిలీ పట్టా

పథకం ప్రకారమే

బనగానపల్లిలోని రెండు క్లాత్ స్టోర్ యజమానులైన గుండా రవికుమార్, ఇటిక్యాల సాయిరాం ఇద్దరు కలిసి క్లాత్ మర్చంట్ పేరుతో భవనం నిర్మించాలని మూడేళ్ల కిందట ఆలోచించారు. ఈ క్రమంలో వీరద్దరు కలిసి ఎవరికీ అనుమానం, అభ్యంతరాలు తలెత్తకుండా క్లాత్‌మర్చంట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వారే అధ్యక్ష, కార్యదర్శులుగా నిలిచారు. తర్వాత అసలు కథ మొదలైంది. ఇంకేముందీ.. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆశ్రయించి తమ అసోసియేషన్ భవనానికి 5 సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. ఆ తర్వాత వెంటనే.. అప్పటి గ్రామ పంచాయితీ అధికారి ఖలీల్‌భాషాతో పాటు ఎంపీడీఓ శివరామయ్యను వారు కలిశారు. అప్పటి రాజకీయ ఒత్తిళ్లతో చేసేదీ లేక.. 5 సెంట్లు స్థలం కేటాయించే విధంగా తీర్మానం చేసి అధికారులు చేతులు దులుపుకు న్నారు. అదీ కూడా ఇద్దరికి రెండున్నర సెంట్ చొప్పున 5 సెంట్లు ఇచ్చేలా తీర్మానం చేసి అప్పటి తహసీల్దార్‌కు నివేదిక పంపారు. అయితే అప్పుడు అసోసియేషన్‌కు స్థలాన్ని ఇచ్చేందుకు తహసీల్దార్‌కు ఒప్పుకోలేదు.

చివరికి నకిలీ పట్టాలతో నిర్మాణం

అధికారుల స్థలం కేటాయించకపోవడంతో అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో వీరిద్దరూ కలిసి ఎస్ఆర్‌బీసీకి చెందిన స్థలంపై కన్నేశారు. సర్వే నెంబర్ 146-1లో గుండా రవికుమార్, ఇటిక్యాల సాయిరాం ఇద్దరు తమ పేర్లపై 5 సెంట్లు పట్టా పొందినట్లు నకిలీ పట్టాలు సృష్టించారు. అప్పటి రాజకీయ అండదండలతో చకచక సదరు భవన నిర్మాణాన్ని చేసేశారు. అదీ కూడా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో 29.02.2024లో ప్రారంభోత్సవం నిర్వహించి తమకు, తమ భవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడ్డారు. ఈ అక్రమ భవనంపై ఎంపీడీఓ, ఈఓ పేర్లు ఉండటం విశేషం. ఇదంతా అధికారులకు తెలిసినా వారు అప్పటి ప్రభుత్వానికి భయపడి మిన్నుకుండిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల బనగానపల్లె ఉపసర్పంచ్ బారానుద్దీన్ సదరు భవన స్థలం పట్టాలపై ఆర్టీ యాక్ట్ కింద కోరడంతో అసలు విషయం వెలుగు చూసింది. తీర్మానం చేసినప్పటికీ వారికి వారికి స్థలాలు కేటాయించలేదని పంచాయతీ అధికారులు తెలియజేశారు.



ఇటిక్యాల సాయికుమార్ పేరు మీద తయారు చేసిన నకిలీ పట్టా...



నకిలీ పట్టాలతో నిర్మించిన క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవనం

ఇద్దరిపై కేసులు నమోదు

నకిలీ పట్టాలు సృష్టించి దిక్లాత్ మర్చంట్ అసోసియేషన్ రెసిడెన్సీ నిర్మించినందుకు అధ్యక్ష, కార్యదర్శులు గుండా రవికుమార్, ఇటిక్యాల సాయిరాంపై సెక్షన్లు 420,468,471 రెడ్ విత్ 34 కింద కేసులు నమోదు చేశాం. పంచాయతీ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదుతో కేసులు నమోదు చేశాం.

-ప్రవీణ్‌కుమార్, సీఐ



అవి ఫేక్ పట్టాలే

క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా రవికుమార్, ఇటిక్యాల సాయికుమార్‌కు ఇచ్చిన పట్టాలను తాము తనిఖీ చేశాం. అవి నకిలీ పట్టాలని గుర్తించాం. గత తహసీల్దార్లు ఎవరూ ఇవ్వలేదు. పైగా వాటిపై తహసీల్దార్ పేరుకానీ.. సీల్ కానీ లేదు. పట్టాలిచ్చినట్లు రికార్డుల్లో కూడా లేదు. ఫేక్ పట్టాలని తెలుస్తోంది. -నారాయణరెడ్డి, తహసీల్దార్, బనగానపల్లె

పోలీసులకు ఫిర్యాదు చేశాం



మాకు వచ్చిన ఫిర్యాదుల పరంగా పరిశీలించాం. ఎలాంటి అనుమతులు అక్రమంగా భవనాన్ని నిర్మించారు. కావున సదరు నిర్మాణం చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అక్రమ భవనంగా గుర్తించాం. త్వరలో చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

-సతీష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ అధికారి

సీఎంను కలిసిన మల్లెల రాజశేఖర్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్ర వారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీటీడీ బోర్డు సభ్యుడు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కలిశారు. ఓర్వకల్లు మండలంలో వివిధ గ్రామాల్లో నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో ఉన్నారని, పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎంను కోరినట్లు మల్లెల రాజశేఖర్ తెలిపారు. త్వరలో ఓర్వకల్లులో బీటెక్, ఐటీఐ, డిప్లమా చదివిన నిరుద్యోగులు 20వేల మందితో ముఖాముఖి చర్చ జరపాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఓర్వకల్లులో ఏర్పాటు చేస్తున్న కార్ల పరిశ్రమకు త్వరగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించాలని సీఎం చంద్రబాబును కోరామన్నారు. ఓర్వకల్లులో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరామని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల కాపు సంఘం నాయకులు కేవీ మధు, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా ఉన్నారు.

నేటి నుంచి భూ విలువల సవరణ




కిటకిటలాడుతున్న కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల విలువలను సవరించనున్నారు. అర్బన్, గ్రామ కమిటీల సూచనల ఆధారంగా, ఇతర అంశాల ప్రాతిపాదికన వ్యవసాయేతర, వ్యవసాయ భూములను మూడు భాగాలుగా విభజించి ధరలు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు అన్నిచోట్లా 10 నుంచి 15 శాతం పెంచాలని చూస్తున్నారు. దీనిపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకొని అనంతరం సవరించిన రిజిస్ట్రేషన్ ధరలను ఫిబ్రవరి 1వ తేది నుంచి అమలు చేయనున్నారు. మార్కెట్ విలువకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ చార్జీలు సవరించి వినియోగదారులపై భారం పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభించనుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదాయార్జనే లక్ష్యంగా ఉన్న విలువకు రెండు, మూడంతల రేట్లు పెంచడంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉమ్మడి జిల్లాలో ఆస్తులు స్థలాల క్రయవిక్రయాలు మందగించడంతో ప్రభుత్వం ఆదాయానికి భారీ గండి పడింది. రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెచ్చుతగ్గులను సవరించి భూవిలువలను పెంచేందుకు చర్యలు తీసుకుంది.

చివరి రోజు కిటకిటలాడిన కార్యాలయాలు: ఫిబ్రవరి 1 నుండి భూ విలువల సవరణ నేపథ్యంలో చివరి రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భూముల విలువ సవరించడంతో రేట్లు పెరుగుతాయన్న ఉద్దేశంతో క్రయ విక్రయదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు తరలివచ్చారు. రద్దీ పెరగడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిదానంగా సాగింది. మరోపక్క సర్వర్లు మొరాయించడంతో అధికారులు రాత్రి సమయంలోనూ పనిచేయాల్సి వచ్చింది.

తుంగభద్ర గేట్ల ఏర్పాటుకు కసరత్తు..!

● దామాషా ప్రకారం ఏపీ, కర్ణాటక నిధులు సమకూర్చాలి
● గేట్ల సామర్థ్యంపై మరోసారి తనిఖీ
● ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక భేటీ
● హాజరైన టీబీపీ బోర్డు చైర్మన్, సెక్రెటరీ, రాష్ట్రాల సభ్యులు



కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు ఏర్పాటుపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) దృష్టి సారించింది. శుక్రవారం ఢిల్లీలో టీబీపీ బోర్డు చైర్మన్ పాండే, సెక్రెటరీ ఓ.రామకృష్ణారెడ్డి సహా ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లను మార్చాల్సిందేనని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ గతేడాది సెప్టంబరులో ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప సహా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం 1953లో నిర్మాణం పూర్తి చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. గతేడాది ఆగస్టు 10న చైన్‌లింక్ తెగిపోయి 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. 33 క్రస్ట్‌గేట్లు ఉంటే.. 70 ఏళ్ల తర్వాత ఓ గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు నాయకత్వంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ చైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్‌కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వైజరీ కమిటీ రిటైర్డు సెక్రటరీ సిద్దరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ గతేడాది సెప్టెంబరులో డ్యాం, గేట్లను క్షుణంగా పరిశీలించి మొత్తం గేట్లను మార్చాలని నివేదిక ఇచ్చింది.

ఏపీ, కర్ణాటక దామాషా ప్రకారం నిధులు ఇవ్వాలి:

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటు చేసేందుకు నిపుణులతో అధ్యయనం చేయించాలని, భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్టత (డ్యాం హెల్త్ కండీషన్)పై పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో స్టడీ చేయించాలని బజాజ్ కమిటీ సూచించింది. ఈ మేరకు కొత్త గేట్లు ఏర్పాటుకు ముందు మరోసారి నిపుణులతో ప్రస్తుతం ఉన్న గేట్లు సామర్థ్యంపై అధ్యయనం చేయించాలని ఢిల్లీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే కొత్త గేట్ల ఏర్పాటుకు అవసరమైన నిధులు సమీకరణ కోసం రుణం తీసుకోవాలని, డ్యాం రిహ్యాబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్)-2 కింద కేంద్ర నిధులు అడగాలని కర్ణాటక ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఒకేసారి 33 గేట్లు మార్చడం కష్టతరం కాబట్టి.. ఏటేటా ఎన్ని గేట్లు మారుస్తున్నామో అందుకు అవసరమైన నిధులు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు దామాషా ప్రకారం కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ వేసవిలో కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు స్థానంలో ఒక్కటే కొత్త గేట్లు ఏర్పాటు చేస్తారా..? మిగిలిన గేట్ల పనులు కూడా మొదలు పెడతారా..? స్పష్టత లేదు. ఏకే బజాజ్ కమిటీ సూచించిన మేరకు ఉన్న గేట్లు తొలగించి కొత్త గేట్లు ఏర్పాటుకు ముందు వాటి సామర్థ్యంపై తప్పకుండా సంబంధిత నిపుణులతో స్టడీ చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.



గత ఏడాది సెప్టెంబరులో తుంగభద్ర డ్యాంను పరిశీలించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ సభ్యులు

మాట నిలుపుకున్న సీఎం

● కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం నిర్వహించినందుకు కృతజ్ఞతలు
● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కన్యాకా పరమేశ్వరి పూజల్లో కుడా చైర్మన్

కర్నూలు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలోని కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం అధికారికంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్‌తో కలిసి కర్నూలు, కల్లూరు అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులను చిన్న చూపు చూశారని అన్నారు. చంద్రబాబు ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఎన్నికల ముందుకు హైకోర్టు బెంచ్‌ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీకి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉండటంతో ప్రజలు చంద్రబాబుపై భరోసా పెట్టుకున్నారని అన్నారు.

మాకు మిగిలింది దు:ఖమేనా?

● పెన్నా సిమెంట్‌కు భూములిచ్చిన రైతుల ఆవేదన
● న్యాయం చేయాలని ధర్నా



పెన్నా రహదారిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

కొలిమిగుండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ కోసం జీవనాధారమైన భూములిచ్చిన తమకు చివరకు మిగిలింది దుఃఖమేనా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో లభించే ముడి ఖనిజం ఆధారంగా సరిహద్దులోని తాడిపత్రి మండలంలో పెన్నా సిమెంట్ పరిశ్రమను 1999లో నిర్మించారు. ఇందు కోసం మండలంలోని ఉమ్మాయిపల్లె, కోరుమానుపల్లె, అబ్దులాపురం, తోళ్లమడుగు గ్రామాల నుండి గత 25 ఏళ్ల క్రితం సుమారు 800 ఎకరాలు భూములు సేకరించారు. అయితే భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మరొకవైపు ఇటీవలే ఒక ఏడాది క్రితం పెన్నా సిమెంట్ పరిశ్రమను ఆదాని గ్రూప్ టేకోవర్ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ఉమ్మాయిపల్లె, ఉమ్మాయిపల్లె తండాకు చెందిన సుమారు 70మంది రైతులు కోరుమానుపల్లె సమీపంలోని పెన్నా సిమెంట్ మైనింగ్ రహదారిలో ధర్నాకు దిగారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామ సర్పంచ్ ఆదినారాయణ రెడ్డితో గోపాల్‌రెడ్డి, కంబయ్య, గంగశేఖర్ యాదవ్, చిన్న నాగిరెడ్డి, రామునాయక్, కిశోర్‌నాయక్, కత్తి నాగిరెడ్డి తదితరులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు లేక, ఉపాధి లేక తమ పిల్లలు బయట రాష్ట్రాల్లో బతుకు దెరువు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామ పరిధిలో 350 ఎకరాల విలువైన భూములు పరిశ్రమ కోసం కోల్పోయామన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల జోక్యంతో ధర్నా విరమణ

రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రాకపోకలను అడ్డుకోవడం తగదని అన్నారు. పరిశ్రమ ప్రతినిధులతో రైతులను మాట్లాడించారు. వారం రోజుల్లో భూములు కోల్పోయిన రైతుల వద్దకు వచ్చి వివరాలు సేకరించి, యాజమాన్యానికి తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



రైతులతో చర్చిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, సీఐ రమేష్‌బాబు

ఏకమై కాజేశారు..!



ప్రస్తుత రుద్రవరం పంచాయతీ సచివాలయం

(3వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటారా?

రుద్రవరం పంచాయతీలో జరిగిన అవినీతిపై తీగ లాగితే డొంక కదిలింది. విచారణ అధికారి కూడా లోతుగా విచారణ చేసి రూ.1.88 కోట్లు ప్రజా ధనం దుర్వినియోగం అయినట్లు తగిన ఆధారాలతో నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అవినీతిలో భాగస్వాములైన వారిపై జిల్లా కలెక్టర్ ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అధికారులను సస్పెండ్‌తో సరిపెడతారా? లేక సర్పంచ్‌తో పాటు వీరందరిపై కేసులు నమోదు దిశగా చర్యలుతీసుకుంటారా? అక్రమాల పరంగా తేలిన నగదును రికవరీ చేసి అక్రమార్కులను వదిలేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే సదరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయకపోతే భవిష్యత్‌లో కూడా మరింత అవినీతి అక్రమాలు జరిగే అవకాశం లేకపోలేదు. రుద్రవరం మేజర్ పంచాయతీలోనే రూ.కోట్లలో అక్రమాలు జరిగితే మిగిలిన పంచాయతీలపై కూడా కలెక్టర్ దృష్టి సారించి విచారణ చేపడితే మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విచారణ పూర్తి అయింది

రుద్రవరం మేజర్ పంచాయతీలో అక్రమాల అభియోగాలపై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నివేదిక పూర్తి అయింది. నివేదిక కూడా అందజేశారు. కాకపోతే మరోసారి పూర్తి స్థాయిలో విచారణ చేయమని ఆదేశించాం. తగిన నివేదిక మరింత సమగ్రంగా ఉండేలా ఆదేశించాం. త్వరలోనే జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి నివేదిక అందజేస్తాం.

- షేక్ జమీవుల్లా, డీపీఓ, నంద్యాల జిల్లా

● గ్రామ పంచాయతీ సాధారణ నిధులు (14, 15 ఫైనాన్స్) కింద 01.04.2021 నుంచి 31.03.2025 వరకు 40 రకాల పనులకు సంబంధించి కొన్నింటిలో పెట్టిన బిల్లులు పరంగా.. డ్రా చేసిన నగదుకు సంబంధించి ఎలాంటి తీర్మానాలు లేకుండా, ఫేక్ బిల్లులు సృష్టించారు. సర్పంచ్, కార్యదర్శులు కనీస నిబంధనలు పాటించలేదని తేలింది. మొత్తం మీద రూ.71,04,621ను దుర్వినియోగం చేసినట్లు తేలింది.

● జూలై 2021 నుంచి జూలై 2022వరకు జరిగిన పంచాయతీ అజెండా పరంగా పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు ఉన్నారు. కానీ ఆయా తీర్మానాల రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్ కూడా మెయింటైన్స్ చేయలేదు. తనిఖీల సమయంలో కొన్ని వస్తువులకు సంబంధించి స్టార్ రిజిస్టర్‌తో పాటు పాత మెటీరియల్‌కు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ చూపించకపోవడం గమనార్హం. వీటితో పాటు 01.04.2023 నుంచి 31.03.2024 వరకు జరిగిన 24 అజెండాల పరంగా.. కొన్నింటిలో 2022-23, 2023-24 కింద నిధులు డ్రా చేయడానికి ముందుగా తీర్మానాలు చేసి ఆయా సంబంధిత పనులు చేసిన తరువాత ఎంబీ చేసుకోవాలి. కానీ పై పనులకు సంబంధించి ఎలాంటి తీర్మానాలు, ఎంబీ కానీ నమోదు చేయలేదు. కొన్ని బిల్స్ పరంగా చూస్తే.. కొన్ని ఫేక్ బిల్లులుగా అనుమానం రావడంతో వెంటనే సదరు విచారణ అధికారి ఆయా బిల్లులకు సంబంధించిన వారికి ఫోన్ చేయగా తమకు చెందినవి కాదని.. ఫేక్ బిల్లులని నిర్ధారణ చేశారు. పోనీ ఆయా బిల్లులకు సంబంధించి వస్తువుల విషయంలో ఎప్పటికప్పుడు పంచాయతీ స్టాక్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసుకుని వినియోగించుకున్నారా? అంటే అదీ లేదు. మొత్తం మీద రూ.1,11,34,909 నగదు దుర్వినియోగమైనట్లు విచారణ అధికారులు గుర్తించారు.

● 2021-2024 వరకు కబేళా, వారంతపు సంతలు, దినసరి మార్కెట్ వేలం పాటల ద్వారా వచ్చిన నిధుల్లో వ్యత్యాలు ఉన్నాయి. మొత్తంగా రూ.32,56,900 రాగా రూ.26,97,100 మాత్రమే జమ చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.5,95,800 నగదును రికవరీ చేయాల్సి ఉంది.

క్రీడారంగం అభివృద్ధే ధ్యేయం

● శాప్ చైర్మన్ రవి నాయుడు ●అభివృద్ధి, సంక్షేమాల్లో ముందుకు పోతున్న ప్రభుత్వం ●ఎమ్మెల్యే అఖిలప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శాప్ చైర్మన్ రవి నాయుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాప్(ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఇండోర్ స్టేడియాన్ని, భూమా బాలిరెడ్డి ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ఆయన పరిశీలించారు. 2018లో మంత్రి హోదాలో భూమా అఖిలప్రియ రూ.2 కోట్లతో ఆళ్లగడ్డలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు చేపట్టగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు ఆ స్టేడియం పనులు పూర్తిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిన మాజీ సీఎం జగన్ ఇంటి ముందు విద్యార్థులు ఆందోళన చేయాలి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గత వైసీపీ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే సంక్షేమం, అభివృద్ధి ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. ఆళ్లగడ్డలో అవినీతి జరుగుతోందని వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై వారి ఇళ్ల వద్దనే చర్చకు సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయబ్ రసూల్, హుసేన్ బాషా, శ్రీవిద్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

● ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై దాడులు ● నాలుగు వాహనాలకు రూ.50వేల చొప్పున జరిమానా ● నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు - విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్

నంద్యాల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో, మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. నంద్యాల మండలంలోని పలు పత్తి విత్తన శుద్ధి కేంద్రాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ పవన్‌కి శోర్, విజిలెన్స్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్, నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు భవ్యసీడ్స్, శ్రీభారతి, ఆర్‌కే ఆగ్రో ఇండస్ట్రీస్‌లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌టీ కాటన్ టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టలలో హెచ్‌టీ కాటన్ టెస్ట్ నెగెటివ్‌గా వచ్చినట్లు నిర్ధారించారు. అలాగే విత్తన శుద్ధి కేంద్రాలు నిర్వహిస్తున్న రిజిస్టరును తనిఖీ చేశారు. విత్తనశుద్ధి కేంద్రాల యజమానులు విత్తన చట్టం-1996ను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డి. రాజశేఖర్ మాట్లాడుతూ విత్తనశుద్ధి కేంద్రం యజమానులు ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన విత్తనాలనే శుద్ధి చేయాలన్నారు. అలా కాదని వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా :

నంద్యాల పట్టణంలో పలు చోట్ల అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు విజిలెన్స్ సీఐ పవన్‌కిశోర్ తెలిపారు. నూనెపల్లె జంక్షన్, అయ్యలూరు, రైతునగరంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో అధిక లోడ్‌తో వెళ్తున్న కంకర లారీలతోపాటు ఇతర వాహనాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు వాహనాలను గుర్తించి ఒక్కొక్క వాహనానికి రూ.50వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు

రెగు ఛాంపియన్ మణిపూర్



ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాన్ని చూస్తున్న క్రీడాకారులు

నంద్యాల వైద్యం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరుగుతున్న 28వ జాతీయ జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో రెగు విభాగంలో మణిపూర్ బాల, బాలికల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలుర తుది పోరులో మణిపూర్ జట్టు నాగాలాండ్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. నాగాలాండ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మణిపూర్ జట్టు కేరళ జట్టుపై 2-0 పాయింట్ల తేడాతో గెలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కేరళ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. అంతకు ముందు రెగు బాలుర క్వార్టర్ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు మహారాష్ట్ర జట్టుపై 2-0, బీహార్ జట్టు తమిళనాడు జట్టుపై 2-0, ఢిల్లీ జట్టు ఉత్తరప్రదేశ్ జట్టుపై 2-1, నాగాలాండ్ జట్టు ఒరిస్సా జట్టుపై 2-0 ఆధిక్యంతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెమీ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు ఢిల్లీ జట్టుపై 2-0, నాగాలాండ్ జట్టు బీహార్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో గెలుపొంది ఫైనల్‌కు చేరాయి. బాలికల రెగు పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌లో హర్యానా జట్టు రాజస్థాన్ జట్టుపై 2-0, ఆంధ్రప్రదేశ్ జట్టు ఢిల్లీ జట్టుపై 2-0, మణిపూర్ జట్టు బీహార్ జట్టుపై 2-0, కేరళ జట్టు ఒరిస్సా జట్టుపై 2-1 ఆధిక్యంతో గెలిచి సెమీ ఫైనల్‌కు చేరాయి. సెమీ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు హర్యానా జట్టుపై 2-0, కేరళ జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో ఫైనల్‌కు చేరుకున్నట్లు రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

ద్వితీయ స్థానంలో నాగాలాండ్, కేరళ జట్లు



బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ విజేతలు మణిపూర్, నాగాలాండ్ జట్లు

జాతీయ చాంపియన్ షిప్‌లో ఆంధ్రజ్యోతి రెపరెపలు

నంద్యాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాన్ని క్రీడాకారులు ఆసక్తిగా చదివారు. పత్రికలో వచ్చిన కథనానికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్నాయి. మరో రెండు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నట్లు నిర్వాహక కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ తెలిపారు.



తలపడుతున్న నాగాలాండ్, ఒరిస్సా జట్లు



ఆశలన్నీ ఆమె వైపే..

- రైల్వే కోచ్ పరిశ్రమకు రూ.200 కోట్లు కావాలి
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ అభివృద్ధికి మరిన్ని నిధులు
- దూపాడు-ఓర్వకల్లు రైలు మార్గానికి మోక్షం లభించేనా?
- కలగానే మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్
- కర్నూలు నుంచి విశాఖకు రైళ్లు నడపాలి
- ట్రిపుల్ ఐటీడీఎం కాలేజీకి రూ.378 కోట్లు ఇవ్వాలి
- నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

గతేడాది టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జూలై 23 ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కందనవోలు కరువు తీర్చేలా ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేశారు. అదే తరహాలో శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే 2025-26 కేంద్ర బడ్జెట్‌లోనూ జిల్లా ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, పరిశ్రమలకు సముచిత స్థానం కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. దశాబ్దకాలంగా సాగుతున్న రైల్వే కోచ్ పరిశ్రమ పూర్తికి రూ.200 కోట్లు ఇవ్వాలి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి రూ.2,880 కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలి. ట్రిపుల్‌ఐటీడీఎం కాలేజీకి రూ.378 కోట్లు నిధులు ఇవ్వాలి. పశ్చిమ ప్రాంతం ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు నూతన రైల్వేలైన్ కల సాకారం దిశగా అడుగులు పడాలి. నేడు ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో కందనవోలుకు కేటాయింపులపై నిర్మల మనసు చాటాలని వివిధ వర్గాల ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

రైల్వే కోచ్‌కు రూ.200 కోట్లు అవసరం

కర్నూలు రూరల్ మండలం పంచలింగాల సమీపంలో రైల్వే కోచ్ మిడ్ - లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్ (ఎంఎల్ఆర్)ను 2013-14లో రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి రైల్వే కోచ్ పునరుద్ధరణ పరిశ్రమ తీసుకురావడంలో అప్పటి రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కృషి ఉంది. పంచాలింగాల గ్రామం వద్ద 142 ఎకరాల్లో రూ.110 కోట్లతో నిర్మాణం చేపట్టే యూనిట్ నిర్మాణం పనులు దశాబ్దకాలంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపుగా రూ.340 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి



చేశారు. ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ వర్క్‌షాప్ ప్రారంభమైతే 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. ఈ పరిశ్రమను పూర్తి చేయడానికి సుమారు రూ.200 కోట్లు నిధులు అవసరమని అంచనా. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ అవసరమైన నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అదే క్రమంలో సీఎం చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది పరిశ్రమను ప్రారంభించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఈ వర్క్‌షాప్‌లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పిల్లల విద్యాభ్యాసం కోసం 5 ఎకరాల్లో కేంద్ర విద్యాలయం నిర్మాణం కోసం కూడా నిధులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రిపుల్ ఐటీడీఎంకి రూ.378 కోట్లు

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కర్నూలు నగరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీడీఎం) కేంద్రం మంజూరు చేసింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం జగన్నాథగట్టుపై 152 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.296 కోట్లతో ట్రిపుల్ ఐటీడీఎం కాలేజీ క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 16 తరగతి భవనాలు, 22 ల్యాబ్స్, లైబ్రరీలు, మూడు సెమినార్ హాల్స్, మల్టీపర్పస్ హాల్, కంప్యూటర్ ల్యాబ్, రెండు మెస్ బ్లాకులు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వంటివి నిర్మించారు. 2018 జూలై నుంచి కర్నూలు క్యాంపస్ కేంద్రంగా కళాశాల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాలేజీ విస్తరణలో భాగంగా డ్రోన్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ల్యాబ్, మెకానికల్ ల్యాబ్ వంటి వాటికి రూ.52 కోట్లు, ఈ విద్యా సంస్థ నిర్వహణ, ఉద్యోగుల జీతాలు వంటి వాటి కోసం రూ.26.49 కోట్లు కలిపి రూ.78.49 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదన పంపారు. అలాగే 80 స్టాఫ్ క్వార్టర్స్ అదనపు ల్యాబ్స్, కాన్ఫరెన్స్ హాల్, క్రికెట్ గ్రౌండ్, ఆసుపత్రి నిర్మాణం.. వంటి వాటి కోసం మరో రూ.300 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన పంపారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ అభివృద్ధికి...

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేస్తామని జూలై 23న ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాల తయారీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు ఆభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమల ఏర్పాటుకు రూ.12 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) అంచనా వేసింది. తద్వారా 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన కోసం రూ.2,786 కోట్లు నేటి బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని మేధావులు కోరుతున్నారు.

మంత్రాలయం-కర్నూలు
రైల్వేలైన్‌కు మోక్షం లభించేనా..?

మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు నూతన రైల్వేలైన్ పశ్చిమ ప్రాంత ప్రజల దశాబ్దాల స్వప్నం. 48 ఏళ్ల క్రితం ఎమ్మిగనూరుకు చెందిన అప్పటి ఎంపీ వై.గాదిలింగన్నగౌడ్ పార్లమెంట్‌లో గళమెత్తారు. ఆ తరువాత మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కూడా ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లో ప్రతిపాదించారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు ట్రాఫిక్ సర్వే చేసి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా 2004 బడ్జెట్‌లో రూ.166 కోట్లు కేటాయింపులు చేశారు. డీపీఆర్ కోసం నిధులు కేటాయింపులు చేశారు. మంత్రాలయం రోడ్ రైల్వే స్టేషన్ (తుంగభద్ర), మాధవరం, మంత్రాలయం, ఇబ్రహీంపురం, నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు మీదుగా కర్నూలు సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ వరకు 110 కిలోమీటర్ల ఈ రైలు మార్గం పాలకుల నిర్లక్ష్యానికి గురై అటకెక్కింది.

వీటిపైనా దృష్టి సారించాలి

- కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే గూడ్‌షెడ్లను దూపాడుకు మార్చాలనే ప్రతిపాదన ఉంది. ఖాళీ చేసే గూడ్‌షెడ్ ప్రాంతంలో రైళ్లు నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలి. కర్నూలు నుంచి విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రైళ్లు నడపాలి.
- కర్నూలు నుంచి రామమేశ్వరం, విశాఖపట్నం, గద్వాల-రాయచూరు మీదుగా ముంబాయికి కొత్త రైళ్లు మంజూరు చేయాలి
- దూపాడు-ఓర్వకల్లు రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనను నంద్యాలకు పొడిగించాలి. తక్షణమే సర్వే, నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలి
- కర్నూలు రైల్వే స్టేషన్ పడమర వైపు వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, సంతోశ్‌నగర్.. ఇలా వివిధ కాలనీ ప్రజలకు ఉపయోగకరంగా పార్కింగ్, బుకింగ్ కేంద్రాలు సహా వివిధ సౌకర్యాలకు అమృత్ స్టేషన్‌లో భాగంగా రూ.43 కోట్లతో పనులు చేపట్టారు. రూ.11 ఆదోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఈ పనులు గడువులోగా పూర్తయ్యేలా సకాలంలో నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- మహబూబ్‌నగర్-డోన్ వయా కర్నూలు డబ్లింగ్ రైల్వేలైన్, విద్యుద్దీకరణ పనులకు ఇటీవలే కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకు కావాల్సిన నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని పలువురు కోరుతున్నారు.
- హగరి-జడ్చర్ల వయా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం జాతీయ రహదారి-167 నిర్మాణంలో భాగంగా హగరి-ఆదోని వయా ఆలూరు మధ్య పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆదోని బైపాస్ రోడ్డు పనులు తక్షణమే మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

98,498 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ఆదోని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

ఎమ్మిగనూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పరిధిలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 98,498 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల ద్వారా 4975 మంది రైతుల నుంచి రూ.7,21,673 విలువ చేసే 98,498 క్వింటాళ్ల పత్తి కొన్నామని అన్నారు. ప్రస్తుతం రైతులు పత్తి అమ్మకానికి రావటం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర మద్దతు ధరకన్నా ఎక్కువగా ఉండటంతో రైతులు అక్కడే విక్రయిస్తున్నారన్నారు. మార్చి వరకు పత్తి కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న పద్మావతి

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై
టీడీపీ శ్రేణుల సంబరాలు

- కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై గౌరుచరిత హర్షం

కల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం పట్ల పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శుక్రవారం తన నివాసంలో కేక్‌కట్ చేసి థాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని అమ్మ హాస్పిటల్ కూడలిలో బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కావాల్సిన వసతులు, స్థల పరిశీలన కోసం కలెక్టర్‌కు సూచించడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు అడుగులు వేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులని రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా చేయాలని కుట్రలకు పాల్పడిందన్నారు. కర్నూలును న్యాయ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రాజధాని, అమరావతిని శాసన రాజధాని, విశాఖను పరిపాలన రాజదాని అంటూ ప్రజల మనోభావాలతో ఆడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార దర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.ఫిరోజ్, ఎన్వీ.రామకృష్ణ, కర్నూలు కూడా మాజీ డైరెక్టర్ చిన్నమారెన్న, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నాగముని, 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్.శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా చెక్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల పరిధిలో సెస్సు వసూళ్లను వంద శాతం పెంచేందుకు ప్రభుత్వం మహాచెక్ పేరుతో అకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టిందని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు. రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు సెస్సును చెల్లించకుండా అక్రమ మార్గాల్లో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందుకే మహా చెక్ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ప్రతిరోజు కర్నూలు జిల్లాలోని 7 మార్కెట్ కమిటీల పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పంట ఉత్పత్తులను బయటి ప్రాంతాలకు తరలిస్తున్న వ్యాపారులు సెస్సు చెల్లించారో లేదో గుర్తించేందుకు అకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు, పత్తికొండ తదితర మార్కెట్ కమిటీల పరిధిలో తమతో పాటు ఆయా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, వారి సిబ్బంది ప్రతిరోజు చెక్‌పోస్టులను తనిఖీ చేసి నివేదికను తమకు అందించాలని ఏడీఎం నారాయణమూర్తి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

జిన్నింగ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 కోట్ల విలువైన పత్తి దగ్ధం

నందవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామం దగ్గర మురారి జిన్నింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లులో పని చేస్తున్న వారు షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల రైతుల దగ్గర నుంచి క్వింటా రూ.6,200 ప్రకారం కొని ఫ్యాక్టరీలో ఉంచిన 5,200 క్వింటాళ్లు తగలబడిపోయాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినా పరిస్థితి అదుపులోకి రాలేదు. యజమాని మురహరి రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీలో నిల్వ ఉన్న 5వేల క్వింటాళ్ల పత్తి షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.3 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇన్సూరెన్స్ సర్వేయర్ అంచనా వేస్తేనే నష్టం ఎంత జరిగిందన్న విషయం తెలుస్తుందన్నారు.



జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

కర్ణాటకలో మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా

రాయచూరు-మంత్రాలయం మధ్య రాకపోకలు బంద్

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక గుంజెహల్లి గ్రామ సమీపంలో మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ లారీ బోల్తా పడింది. శుక్రవారం ఈ ఘటన జరిగింది. మంత్రాలయం నుంచి రాయచూరు వెళ్తున్న మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో మిథనాల్ ఆయిల్ రోడ్డుపై పడింది. మిథనాల్‌కు పేలుడు సంభవించే ప్రమాదం ఉండటంతో ఎరిగేరి, రాయచూరు పోలీసులు అగ్నిమాపక సిబ్బంది, ఆర్‌టీపీఎస్, పీఐఎస్‌ఎఫ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాయచూరు-మంత్రాలయం జాతీయ రహదారి-167 మధ్య వాహనాల రాకపోకలకు బంద్ చేయించారు. దీంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మిథనాల్ ట్యాంకర్ పేలకుండా కర్ణాటక పోలీసులు అప్రమత్తత వహించి మిథనాల్‌ను తొలగించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఆర్‌యూ విద్యార్థి

కర్నూలు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి బి. శ్రీనివాసులు ఎంపిక కావడం అభినందనీయమని వర్శిటీ ఇన్‌చార్జీ ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. 2న మంగళగిరిలో జరిగే 7వ ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. విజయకుమార్, డీన్ సుందరానందపుచ్చా, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ, ప్రొఫెసర్లు

స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

నంద్యాల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయం ఉపాధి పథకాలకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుగుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన ఓసీలు ఫిబ్రవరి 7 వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఫార్మసీ అభ్యర్థులు కూడా అర్హులన్నారు. 21 నుంచి 61ఏళ్ల లోపు ఉండాలని బీపీఎల్ పరిధిలో ఉండాలన్నారు. కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ప్రచారం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కోరారు.

కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి


తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మహానంది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి సభ్యుడు లాయర్ కృష్ణారెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులు సాగేశ్వరరెడ్డి పట్నం రాముడు, సదా శివారెడ్డితో కలిసి తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నిర్వహణ చట్టబద్ధంగా చేపట్టక పోవడంతో రాయలసీమ నష్ట పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులో కెఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంత హక్కులకు చట్టబద్ధత వస్తుందని తెలిపారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు విడుదల చెయ్యకుండా 80 టీఎంసీలను పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను వాడుకోవచ్చన్నారు. దీంతో శ్రీశైలం కృష్ణా జలాలను కృష్ణా డెల్టాకు విడుదల చెయ్యాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

బెంచ్ ఏర్పాటుపై సీఎంకు ధన్యవాదాలు

- బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరదరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాలలో మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టడం పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి ఫరూక్‌కు ధన్యవాదాలు తెలిపారు. కర్నూలులో విద్యుత్ నియంత్రణ మండలి, న్యాయ విశ్వవిద్యాలయం కర్నూలులోనే కొనసాగేటట్లు సానుకూల నిర్ణయం తీసుకోవాలని, కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటుచేసి రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

నందికొట్కూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య, మధ్య తరగతి ప్రజల సమస్యలపై సీపీఎం రాజీ లేని పోరాటం చేస్తుందన్నారు. అర్హులైన పేదలకు రెండు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, ఓబులేసు, బాబు పాల్గొన్నారు.

48 గంటల నిరాహార దీక్ష

పాణ్యం, జనవరి (ఆంధ్రజ్యోతి): మండల సమస్యల పరిష్కారానికి ఈనెల 10. 11 తేదీల్లో 48 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం గిరిజన గురుకుల పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో పాణ్యం నియోజక వర్గానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. జాతీయ స్థాయి క్రీడాకారులున్నా, ప్రోత్సాహం లేదన్నారు. ఎస్పీ అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, మద్దయ్య, వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

నందికొట్కూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి పలు వస్తువులు కాలిపోయాయి. బాధితుల కథనం మేరకు.. ఆత్మకూరు రోడ్డు బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో దూదేకుల ఇస్మాయిల్, షకీన నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు షకీన ఇంట్లో విద్యుత్‌బల్బు స్విచ్ ఆన్ చేయగానే షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. రిఫ్రిజిరేటర్, కూలర్, టీవీలు పాడయ్యాయి. రూ.70 వేల నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ వీఆర్వో నష్టం వివరాలను సేకరించారు.


దగ్ధమైన వస్తువులు

'కల్తీ ప్రేమ బంధాలు' షార్ట్ ఫిల్మ్ విడుదల

నందికొట్కూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కల్తీ ప్రేమ బంధాలు షార్ట్ ఫిల్మ్‌ను సీపీఎం కార్యదర్శి వర్గ సభ్య సభ్యుడు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణానికి చెందిన నిర్మాత అబ్దుల్ రషీద్ నిర్మించిన ఈ షార్ట్ ఫిల్మ్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు ప్రారంభించారు. డైరెక్టర్ మాలిక్, నిర్మాత అబ్దుల్ రషీద్, కెమెరామెన్ ప్రసాద్, ఆర్టిస్టులు అబ్దుల్ రహీం, మహేశ్వరి, సిరి, రాజు, రమణ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోరుకునే ప్రభుత్వం


కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరుకుంటుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7550ల ప్రకారం కొంటారన్నారు. ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏడీఏ విజయశేఖర్, ఏవో పీరునాయక్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ, సర్వోత్తమ రెడ్డి, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

ఉత్తుత్తి వైద్యం

- మందులు లేవని, తర్వాత ఇస్తామంటున్న వైద్యులు
- సొంత భవనం లేక పీహెచ్‌సీలోనే నిర్వహణ
- కొత్తపల్లి యునానీ వైద్యశాల దుస్థితి



పీహెచ్‌సీలోనే యునానీ వైద్యశాల

కొత్తపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యునానీ వైద్యశాలలో మందులు లేవు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. యునానీ మందులు వాడితో రోగం నమమవుతుందని వస్తే తీరా ఇక్కడ మందులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్త చేస్తున్నారు.

ఇండెంట్ పట్టినా..

వైద్యాధికారి జమాలుద్దీన్ మందుల సరఫరా కోసం ఇండెంట్ పెట్టామని మందులు వస్తాయంటున్నారు గాని ఎప్పుడు వస్తాయో చెప్పడం లేదు.

ఇరుకు గదిలో..

యునాని వైద్యశాలకు సొంత భవనం లేదు. దీంతో కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఒక చిన్న ఇరుకు గదిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ యునానీ వైద్యశాల ఉందన్న విషం రోగులకు తెలియడం లేదు. గతంలో వైద్యశాలకు ఫర్నీచర్ రాగా, ఇక్కడ ఉంచే అవకాశం లేకపోవడంతో పీహెచ్‌సీ వైద్యులే ఉపయోగించుకుంటున్నారు.

15 రోజుల్లో మందులు

కొన్నేళ్లుగా యునానీ వైద్యశాలలకు మందుల్లేని మాట వాస్తవమే. ఇటీవల ఈ విషయాన్ని కొత్తగా వచ్చిన ఏపీ ఆయుష్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. యునానీ మందులను కొనుగోలు చేసి 15 రోజుల్లో అన్ని వైద్యశాలలకు మందులు సరఫరా చేస్తాం **- శేఖర్ రాజు, యునానీ రీజనల్ డైరెక్టర్, కడప**

గూడేల అభివృద్ధికి ప్రతిపాదనలు

కొత్తపలి, జనవరి 31, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గూడేల అభివృద్ధికి రూ.3.61 కోట్ల ఉపాధి నిధులతో ప్రతిపాదనలు పంపినట్లు శ్రీశైలం ఐటీడీఏ ఏఈఈ ప్రదీప్ శుక్రవారం తెలిపారు. గువ్వలకుంట్ల నుంచి పాలంచెరువు గూడెంకు 4కి.మీ.ల బీటీ రోడ్డుకు రూ.1.90 కోట్లు, సంగమేశ్వరం-ఎర్రమఠం గూడేనికి రూ.48 లక్షలు, శివపురం చెంచుగూడెంలో అంత ర్గత సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీకి రూ.35 లక్షలు అవుతాయన్నారు. అలాగే పాలెం చెరువు గూడెం అంతర్గత రోడ్లకు రూ.40 లక్షలు, కొత్తపల్లి బస్టాండు నుంచి భ్రమరాంబ చెంచుగూడేనికి 700 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.48 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు ఏఈఈ తెలిపారు.

క్రీడారంగానికి పూర్వ వైభవం తెస్తాం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


సైకిల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే, శ్యాప్ ఛైర్మన్

ఆత్మకూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): క్రీడారంగానికి పూర్వ వైభవం తెస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడాకారుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు హయాంలో క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు గుర్తుచేశారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు సహకారంతో శ్రీశైలంలో క్రీడాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆత్మకూరు సీఐ రాము చొరవ తీసుకుని పోలీసు కానిస్టేబుల్స్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి 60 మంది ఎంపికయ్యేలా చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించినట్లు ఆరోపించారు. క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించే బదులు క్రీడా ప్రాంగణాలకు కబ్జా చేసే స్థాయికి చేరారని ఆరోపించారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు అత్యుత్తమ వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిపారు. అనంతరం సైక్లింగ్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన మౌలాబీకి ఎమ్మెల్యే రూ.50వేల విలువైన సైకిల్‌ను అందజేశారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ తరుపున ఎమ్మెల్యే బుడ్డాను, శాప్ ఛైర్మన్ రవినాయుడును సత్కరించారు. అంతకుముందు శాప్ ఛైర్మన్ రవినాయుడు కేవీకే ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, డీఎస్‌వో నాగరాజు, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, కలిముల్లా ఉన్నారు.

సహకార సంఘాలది కీలకపాత్ర

- కలెక్టర్ రాజకుమారి


పంట రుణాల చెక్కు ఇస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, పర్యావరణ అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ సహకార సంవత్సరంపై సమీక్ష నిర్వహించారు. జేసీ విష్ణుచరణ్, జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2025ను సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. బిల్డ్ ఏ బెటర్ వరల్డ్ నినాదంతో నెలవారీ లక్ష్యాలను నిర్దేశించిం దన్నారు. పేదరిక నిర్మూలన, విద్య, లింగ సమానత్వం, వాతావరణ, ఇతర ఏడు అంశాలలో సమృద్ధిని సాధించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అనంతరం సొసైటీ ద్వారా 5మంది రైతులకు రూ.3లక్షల చొప్పున పంట రుణాలు చెక్కులను అందజేశారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో వెంకటరమణ


పారుమంచాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

జూపాడుబంగ్లా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం పారుమంచాల, జూపాడు బంగ్లా పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. హాజరు, మందుల నిల్వ, రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలలో అన్ని సౌకర్యాలున్నాయని నెలకు 5 ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకో వాలని సిబ్బందికి సూచించారు. మాతా శిశు మరణాలు తగ్గిం చాలన్నారు. కుష్ఠు నివారణ అధికారి శారద, వైద్యులు యశశ్విని, గంగాధర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

వెలుగోడు: రోగులకు వైద్యులు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని వేల్పనూరు ఆసుపత్రిని తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. వైద్యాధికారి ప్రణీత్, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసులు, సిబ్బంది శ్యాం, అనిత, రామంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి

మహానంది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపాలని ఎంసీ ఫారం వైస్సార్ ఉద్యావన పరిశోధన స్థానం శాస్త్రవేత్త ముత్యాల నాయిడు సూచించారు. శుక్రవారం ఎం.తిమ్మాపురం గ్రామం అంకాలమ్మ ఆలయం పరిసరాల్లో రావే కార్యక్రమంలో కడప ప్రకాశం జిల్లా విద్యార్థుల శిక్షణ కార్యక్రమం శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పకృతి వైరీత్యాల నుంచి తట్టుకొనే ఉద్యాన పంటల సాగు పద్ధతులను వివరించారు. సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ స్వరూప, టీడీపీ అధ్యక్షుడు ఉల్లి మధు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.అ

ఉత్సవాలు జయప్రదం చేయండి

- ఆర్డీవో చల్లా విశ్వనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

నంద్యాల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 22 నుంచి మహానందిలో శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్డీవో చల్లా విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని, షామియాను ఏర్పాటు చెయ్యాలన్నారు. మున్సిపల్ సిబ్బంది రెండు రోజులు ముందుగానే ఫాగింగ్ చేయాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. నంద్యాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్న ఆర్చీలకు ఆర్అండ్‌బీ అధికారులు సహకరించాలని కోరారు. రైలు ప్రయాణికుల కోసం నంద్యాల, గాజులపల్లె రైల్వే స్టేషన్‌ల వద్ద ప్రత్యేక బస్సులను ఉంచాలని ఆదేశించారు. దేవస్థాన పరిధిలో పందులు, గుర్రాలు సంచరించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. భక్తులకు క్యూలైన్లలో ఉచితంగా పాలు, బిస్కెట్లు, ప్రసాదం అందిస్తామని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాహపాల పార్కింగ్‌కు పది ఎకరాలు కేటాయించామన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల కోరిక మేరకు నంది సర్కిల్‌లో 25కేవీ జనరేటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా దేవదాయ పరిసరాలలో 25 అదనపు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఈవో హామీ ఇచ్చారు. ఈనెల 17వతేదిన మరోసారి సమావేశం కావాలని అధికారులు సూచించారు.

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం


ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం

నంద్యాల కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజార్, నూనెపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయాల్లో మూడు రోజుల నుంచి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వాసవీమాతకు సుప్రభాతసేవ, మహిళలు 108 కలశాలతో నీటిని తీసుకొని వచ్చి అభిషేకం చేశారు. ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, మహిళా మండలి ఆధ్వర్యంలో జలాభిషేకం, పండ్లతో అభిషేకం, కుంకుమార్చనలు, గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ సేవాసమితి, వాసవీ సేవాదళ్, వాసవీ ఆర్యవైశ్యసంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

ఆత్మకూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరికి శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా మొక్కులు తీర్చుకున్నారు. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యతోనే భవిష్యత్తు : డీఈవో

- ఆరుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు


స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

వెలుగోడు, జనవరి31 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వెలుగోడులోని జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్, కస్తూర్బా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది, ఇంటర్ విద్యార్థుల స్టడీ అవర్స్‌ను తనిఖీ చేశారు. కస్తూర్బా పాఠశాలలో అల్పాహారాన్ని రుచి చూసి, విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభను చాటాలన్నారు. తల్లిదండ్రులు మిమ్మల్ని కష్టపడి చదివిస్తున్నారని వారి కష్టాలకు తగ్గ ఫలితాలు సాధించాలన్నారు. వెలుగోడు జడ్పీ ఉన్నత పాఠశాల స్టడీ హవర్స్‌లో ఉపాధ్యాయులు లేకపోవడంతో హెచ్‌ఎం, మరో ఐదగురు ఉపాధ్యా యులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఎంఈవో బ్రహ్మంనాయక్, మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు నళిని, శ్రీనిజ, సీఆర్పీ వకీల్ ఉన్నారు.

అన్నదానానికి విరాళం


దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి విజయవాడ భక్తుడు లక్ష్మీసుధాకర్ రూ.2,02,232 విరాళం అందజేశారు. డొనేషన్ కౌంటర్ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. దాతలకు రసీదుతో పాటు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను అందజేశారు.

మెరుగైన సౌకర్యాలు

మహానంది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మహానంది క్షేత్ర పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. అనంతరం టీటీడీ వసతి గృహాలను తనిఖీ చేశారు. భక్తుల విడిది సౌకర్యాలను పరిశీలించారు ఈఏవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం చిన్నాలు పాల్గొన్నారు.

రేపు వసంత పంచమి

ఆత్మకూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భవాని నగర్ అంబాభవాని ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి వసంత పంచమి ఫిబ్రవరి 2న నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం దేవతా మూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తారు.

భక్తి శ్రద్ధలతో ఆత్మార్పణ

వెలుగోడు,జనవరి31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ, ఆర్యవైశ్య నాయకులు పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ కలాం పాల్గొన్నారు.

అంకాలమ్మకు విశేష పూజలు


ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల గ్రామదేవత అంకాలమ్మ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చన క్రతువులను చేపట్టారు. అనంతరం లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ మహా గణపతిపూజ, పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ నిర్వహించారు.

అలకరించిన నిత్యకళారాధన

శ్రీశైలంలో శుక్రవారం రాగసుధ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నిత్యాకళారాధన వేదికపై వినాయకకౌత్వం, శివస్తుతి, నటేశకౌత్యం, శివశివ శంకరా, నమశివాయతే తదితర గీతాలకు ప్రవల్లిక, బిందు, అద్వైత, నవ్య, వర్షిక, శరణ్య, లక్ష్మీ, శ్రీనిధి, చైత్ర, లిఖిత ప్రదర్శనలు ఇచ్చారు.

జ్వాలా నారసింహుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి పార్వేట పల్లకి నాగిరెడ్డిపల్లె, పడకండ్ల గ్రామాల్లో కొలువుదీరింది. పల్లకిలో కొలువైన జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి పల్లకి గ్రామాలకు చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారమే మొదటి ఎజెండాగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొన్నారు. కౌన్సిలర్లు తమవంతు బాధ్యతగా మున్సిపల్ సమావేశాలకు హాజరై సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత మంత్రులతో మాట్లాడి పనులు చేయిస్తానని అన్నారు. పట్టణంలోని రెండు ఇండోర్ స్టేడియాలను రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ లోన్ల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పోస్టల్ సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆళ్లగడ్డ సబ్ డివిజన్ మెయిల్ ఓవర్ సీల్ భాస్కర్ రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లె గ్రామ ఉన్నత పాఠశాల, ఉయ్యాలవాడలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలకు చెందిన 215 మంది విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగేషయ్య, పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


మాజీ మంత్రి బుగ్గనతో పార్టీ అనుబంధ విభాగం నాయకులు

డోన్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇటీవల వైసీపీ అనుబంధ విభాగాల నాయకులుగా ఎన్నుకోబడిన 17మంది నాయకులు మాజీ మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, నాయకులు మల్లెంపల్లె రామచంద్రుడు, పోస్టు ప్రసాద్, రాజావర్ధన్, కటిక వేణు, దొరపల్లి చిరంజీవి, పాల్గొన్నారు.

శాంతి నగర్‌లో లింక్ సీసీ రోడ్లు వేయాలి

కొలిమిగుండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అయితే దానికి అనుసంధానమైన వీధుల్లో కూడా సీసీ రోడ్లు వేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారిపై సీసీ వేయడంతో ఎత్తు పెరగనుందని, దాంతో వర్షం వస్తే నీరు ఇళ్లలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాపోతున్నారు. వీధుల్లో కూడా సీసీ రోడ్లు వేయాలని కోరుతున్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

దొర్నిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని భాగ్యనగరం జెడ్పీహెచ్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయుడుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు, భూమా సంతోష్ రెడ్డి రవినాయుడును సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, పీఈటీ శ్రీధర్, ఉపాధ్యాయులున్నారు.

'జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

దొర్నిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల మాజీ అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 5,400 ఎకరాల్లో మహేంద్ర రకం జొన్నలు సాగు చేశారన్నారు. ధాన్యం దిగుబడులను ఇళ్లల్లో నిల్వ ఉంచుకోవడానికి వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి దరఖాస్తుల వెల్లువ

బనగానపల్లె, జనవరి 31, (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను దరఖాస్తులను మంత్రి క్యాంపు కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శుక్రవారం సాయంత్రం అందించారు. మంత్రి వందలాదిగా వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ+గ్రేడ్

డోన్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): న్యాక్ సంస్థ దేశ వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సర్వేలో డోన్ కళాశాలకు బీ+ క్యాటగిరి కేటాయించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ+ కేటగిరి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆమె తెలిపారు.

క్రీడాకారులకు బహుమతులు

చాగలమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బుగ్గవీధిలో గల క్రీడా మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాతలు మౌలాలి, తౌసిక్, ముస్తాక్, సలీమ్, పీడీ దాదాపీర్, విద్యా కమిటీ చైర్మన్ జల్సాగౌస్, నాయకులు అబ్దుల్ ఖాదర్, జిలేబిషరీఫ్, మక్బూల్, నిర్వాహకులు దాదాపీర్, అల్తాఫ్, రఫి పాల్గొన్నారు.

శ్రమశక్తి సంఘం.. ఉపాధికి ఊతం

- 50 మంది సభ్యులతో సంఘం ఏర్పాటు
- నేటి నుంచి అమలుకు శ్రీకారం

చాగలమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో 2014-19 వరకు శ్రమశక్తి సంఘాలు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వీటిని పునరుద్ధరిస్తూ కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టింది. క్రియాశీల ఉపాధి కార్డుల్లోని పనికొచ్చే వేతనదారులు మాత్రమే శ్రమశక్తి సంఘాల్లోకి తీసుకుంటారు. క్షేత్ర, సాంకేతిక సహాయకులు బాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పనుల అమలులో ఇవి కీలకం కానున్నాయి. ఫిబ్రవరి 1 నాటికి పనులు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అధికార యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది.

35-50 మంది సభ్యులతో ఒక సంఘం

అప్పట్లో 20 మంది కూలీలకు ఒక శ్రమ శక్తి సంఘం ఉండేది. నూతన మార్గదర్శకాల ప్రకారం వేతనదారుల ఇష్టంతో 35 నుంచి 50 మందితో సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. తద్వారా వాటి సంఖ్య సగానికి పైగా తగ్గనుంది. గతంలో ఏర్పాటు చేసిన సంఘాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. సభ్యుల అంగీకారం మేరకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఒకసారి సంఘంగా ఏర్పడిన తరువాత ఏడాది పాటు మార్పునకు అవకాశం ఉండదు.

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఇలా..


శెట్టివీడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని చాగలమర్రి మండలంలో 5,414 మంది కూలీలకు 147 శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ మండలంలో 5,042 మంది కూలీలు ఉండగా 144 గ్రూపులు, దొర్నిపాడు మండలంలో 3,754 మంది కూలీలు, 107 గ్రూపులు, శిరివెళ్ల మండలంలో 6,511 మంది కూలీలు, 185 గ్రూపులు, రుద్రవరం మండలంలో 5,598 మంది కూలీలు, 160 గ్రూపులు, ఉయ్యాలవాడ మండలంలో 3,568 మంది కూలీలు, 102 గ్రూపులుగా ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో 29,854 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. పనికి వచ్చే కూలీలందరిని సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి ఉపాధి పని దినాలు కల్పించనున్నారు.

అర్హతలు ఇవి..

సంఘం సభ్యులై ఉండాలి. చదవడం, రాయడం, సెల్‌ఫోన్ వాడకంపై అవగాహన ఉండాలి. 50 ఏళ్ల వయసు ఉండి మేటీలుగా ఉన్నవారు అర్హులు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు పని చేసి ఉండాలి. రోజువారి పనుల నిమిత్తం ఒక కూలీని పనికి అదనంగా తీసుకొచ్చేందుకు రూ.1.50పైసలు చొప్పున ఇవ్వనున్నారు. సంఘంలోని 50 మందిని తీసుకొస్తే రోజుకు అదనంగా రూ.75 చొప్పున అందుతాయి.

వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి

ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో శ్రమశక్తి సంఘాల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. వారం రోజుల్లో వందశాతం పూర్తవుతుంది. 150 సంఘాలు పూర్తి చేశాం. నేటినుంచే ఆయా సంఘాలకు పనులు కేటాయించనున్నాం. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నాం. వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి.

- సాంబశివరావు, ఏపీడీ, కోవెలకుంట్ల

కూటమి పాలనలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం

బనగానపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినం సందర్భంగా పట్టణంలోని కొండపేటలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారిని మంత్రి దంపతులు దర్శించుకున్నారు. ముందుగా మంత్రి దంపతులకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్య క్షుడు టంగుటూరు శ్రీనయ్య, పట్టణ ఆర్య వైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, జంగంశెట్టి, సుబ్బ సత్యనారాయణ, గుండా శ్రీనివాసులు, చిత్తలూరు ప్రసాద్, బచ్చురమేష్, జక్కా శ్రావణ్ కుమార్, బచ్చు భాస్కర్, ఫణీంద్ర, జక్కా నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని వేద పండితుడు పెద్ద శాస్త్రి ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, నవగ్రహ జపం, మహిళలతో లక్ష కుంకు మార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని వెండి రథంలో కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కె.శివప్రసాద్, కోశాధికారి నవతా ప్రసాద్, ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


బనగానపల్లెలో అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి బీసీ దంపతులు

రుద్రవరం: రుద్రవరం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినాన్ని వేడుకలు నిర్వహించారు. వేద పండితులు రాచమడుగు విశ్వనాధశర్మ, గణేశ్‌శర్మ ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినో త్సవ వేడుకలను ఆర్యవైశ్యులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్ దంపతులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్య క్షుడు సముద్రాల సత్యనారాయణ, యువజన సంఘం ఉపాధ్యక్షుడు కందూరి నవీన్ కుమార్, సంఘం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవుకు : అవుకు పట్టణంలో వెలసిన వాసవీమాత ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజినేయులు, యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లి నాగేంద్ర కుమార్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అమ్మవారిశాలలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిశాల ప్రసిడెంట్ దేవిశెట్టి హరి, వైస్ ప్రసిడెంట్ శివ చరణ్, ప్రదీప్ తది తరులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళా అధ్యక్షురాలు సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: తిమ్మనాయినిపేటలో వాసవీ కన్యకపరమేశ్వరీ ఆలయంలో ఆత్మార్పణం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు బాలు శెట్టి, రమేష్‌శెట్టి, సుధాకర్ శెట్టి పాల్గొన్నారు.


చాగలమర్రిలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

బేతంచెర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరు మాను కొండ గ్రామ సమీపంలో ప్రభుత్వ విద్యా సంస్థల నూతన భవనాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోరుమానుకొండ సమీపంలోని ఉన్న ప్రభుత్వ ఐటీఐ, ఎంఎస్‌ఎంఈ, జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన భవనాల పనులను త్వరగా చేయాలని అన్నారు. అలాగే నూతన భవనాల పెండింగ్ పనులను కూడా నాణ్యతగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ, ఎంఎస్‌ఎంఈ భవనాలు పూర్తయితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సుధీర్ రెడ్డి, డిఈ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, కాంట్రాక్టర్లు, అధికారులు ఉన్నారు.


అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

అక్రమ వసూళ్ల దందా..!

- ముడుపులు ముట్టజెప్పిన వారికే రిజిస్ట్రేషన్
- రిజిస్ట్రేషన్ల ధరల పెంపుతో తరలివచ్చిన రియల్టర్లు
- రైతులు, సామాన్యులను పట్టించుకోని అధికారులు


ప్యాపిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలు

ప్యాపిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ రిజిస్ట్రేషన్ కావాలంటే అడిగినంత ఇచ్చుకోవాల్సిందే. లేదంట సర్వర్లు పనిచేయవు. లేదా.. పెరిగిన ధరల ప్రకారం చేస్తాం.. మూడు రోజుల తర్వాత రండీ అంటూ అధికారులు తెగేసి చెబుతున్నారు. దీంతో ముక్కున వేలేసుకొని అడిగినంత ముడుపులు ముట్టజెప్పి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ప్యాపిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలకొంది. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల ధరలు పెరుగుతుండటంలో గత మూడు రోజులుగా స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాని రద్దీ అధికంగా మారింది. శుక్రవారం ఆఖరి రోజు కావడంతో మండలంలోని రైతులు, ప్రజలతో పాటు. కర్నూలు, అనంతపురం, డోన్, పత్తికొండ ప్రాంతాల నుంచి రియల్ వ్యాపారులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దళారుల ద్వారా రియల్టర్లు అధికారులకు అధిక మొత్తంలో ముడుపులు ముట్టజెప్పి పనిగించుకున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. కార్యాలయం దగ్గర ముడుపుల బాగోతం బహిరంగగా జరుతుతున్న ఎవరు పట్టించుకోక పోవడంతో అక్రమ వసూళ్లకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోండి

డోన్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వారు వెనుకబడిన తరగతుల సహకార సేవా సంఘం ద్వారా రాయితీపై ఉపాధి యూనిట్లు ఏర్పాటు కోసం వెబ్‌సైట్ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీసీ రుణాలు పొందేందుకు 21నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, బీపీఎల్‌కు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హత్యాయత్నం కేసు నమోదు

కొలిమిగుండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలమేరకు బెలుం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఆయన అనుచరుడు సాయిబాబా అనే వ్యక్తులు బెలుం గ్రామానికి చెందిన బాచం ప్రతాపరెడ్డి అనే వ్యక్తిపై నాపరాయి గని విషయంలో శుక్రవారం దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుమేరకు ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో నెలకొన్న వివాదాల కారణంగా మనస్తాపం చెంది వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అంకిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేని(46) మద్యం తాగేవాడు. ఇటీవల 40రోజుల పాటు ఇంటి నుంచి బయటకు వెళ్లి నాలుగు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నారు. వివాదాల కారణంగా ఇంట్లో హుస్సేని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4న ఆళ్లగడ్డలో జాబ్ మేళా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ మాధవకృష్ణ శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలోని మూడు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, సాంకేతిక కోర్సులు చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బడ్జెట్‌లో నిధులను కేటాయించండి

- ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోట్ల దంపతులు


సీఎం నారా చంద్రబాబుతో ఎమ్మెల్యే కోట్ల దంపతులు

డోన్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో డోన్ నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కోరారు. శుక్రవారం అమరావతిలో క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే కోట్ల దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట్ల ఆరోగ్యం గురించి తెలుసుకొని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని డోన్‌కు రూ.90 కోట్లు, ప్యాపిలికి రూ.60 కోట్లు, బేతంచెర్లకు రూ.60 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటితో నింపాలని విజ్ఞప్తి చేశామన్నారు. అలాగే జనాభా నిష్పత్తి ప్రకారం డోన్‌కు గాజులదిన్నె రిజర్వాయరు నుంచి తాగునీరు అందించాలని కోరారు.

డోన్‌లో పశువైద్య శిబిరం

డోన్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.నాగరాజు 25 దూడలకు 205 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. రైల్వే కాలనీ రమేష్ అనే వ్యక్తికి చెందిన ఎలగ్రబిడ్ పొట్టేలు పశువైద్యశాలకు తీసుకుని వచ్చారు. వీటి విలువ రూ.2.10 లక్షలు ఉంటుందని డాక్టరు నాగరాజు తెలిపారు. పందెలకు ఉపయోగించే ఎలగ్రబిడ్ పొట్టేలు పశువైద్యశాల వైద్యశిబిరంలో ఆకర్షణీయంగా నిలిచింది.

కోవెలకుంట్ల: పాడి రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు కంపమల్ల సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కంపమల్ల గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యుడు కృష్ణకుమార్ పశువులు, జీవాలను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో రైతులు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

డోన్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి 13వరకు అంగరంగ వైభవంగా మహోత్సవ కార్యక్రమాలు సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో జరగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నుంచి సాయిబాబా గుడి వరకు తాత్కాలికంగా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు.

మాఘమాసం విశిష్టమైనది

- సాంబశివాలయం అర్చకుడు కల్లె శేషావలి శర్మ


మాట్లాడుతున్న అర్చకులు కల్లె శేషావలి శర్మ

డోన్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పన్నెండు మాసాల్లో మాఘమాసం ఎంతో విశిష్టమైనదని సాంబశివాలయ అర్చకుడు కల్లె శేషావలి శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక సాంబశివాలయంలో విలేకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాఘమాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసమన్నారు. ఈ మాసంలో వివాహాలకు, గృహ ప్రవేశాలకు, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు మంచిదన్నారు. పంచమి, రథసప్తమి మొదలగు పుణ్యతిథులు వచ్చాయని వివరించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా నియంత్రణ వైద్యాధికారి లక్ష్మనాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్యం కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు నితీష్, రాఘవేంద్రగౌడు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కోవెలకుంట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు మండలంలోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా 50శాతం సబ్సిడీతో రూ. లక్ష నుంచి రూ. ఐదులక్షల వరకు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో బీసీ-ఏకి 23, బీసీ బీకి 14, బీసీ డీకి 7, బీసీ ఈకి 11 మొత్తం 55 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కంపచెట్ల తొలగింపు

కోవెలకుంట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం కంపచెట్లు తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఈవోఆర్డీ ప్రకాశ్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు రెండు ఇండస్ట్రియల్ కారిడార్లు మంజూరు కాగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఒకటి కోవెలకుంట్లకు మంజూరు చేయించారన్నారు. స్థలాన్ని పరిశీలించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు ముళ్ల చెట్లను తొలగిస్తున్నామన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

చాగలమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వాసవీ విద్యా సమాజం గౌరవ అధ్యక్షుడు మురికి వేణుగోపాల్, విశ్రాంత ప్రిన్సిపాల్ పోలిశెట్టి అన్నారు. చాగలమర్రి వాసవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఆర్ఎస్ రమణ, కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, షాబుద్దిన్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రఘురామ్, కార్యదర్శి పుల్లారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వరి పంట సాగుపై విద్యార్థులకు అవగాహన

ఉయ్యాలవాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వరి పంట సాగుపై అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ ట్రైనర్ ఉసేన్‌వలి ఆధ్వర్యంలో శుక్రవారం రూపనగుడి గ్రామం పొలాల్లో తొమ్మిది, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు వెంకటరమణ ఉన్నారు.

అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో దాదాపు యాభై సంవత్సరాల వయసు గల అనాథ మహిళ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. అమ్మ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిజ్జల నగేష్ స్పందించి మహిళ మృతదేహాన్ని స్వయంగా శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేసి మానవత్వం చాటుకున్నాడు.